క్లుప్తంగా

నేటి నుంచి పీవో, ఏపీవోలకు శిక్షణ



జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు, సిబ్బందికి శని, సోమవారాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు జగ్గయ్యపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే ఒకసారి శిక్షణ ఇచ్చామని, రెండో విడత శిక్షణకు ఎన్నికల సిబ్బంది తప్పక హాజరుకావాలని సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల కోసం ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్‌ను పొందుపరిచే ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల నియమావళిపై సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. ఈనెల నాలుగో తేదీ నుంచి ఆరోతేదీ వరకు జెడ్పీ బాలుర పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్లను స్వీకరిస్తామన్నారు. ఇందుకోసం ఐదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో ఉన్న 1100మందికిపైగా సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నట్లు ఆయన వివరించారు.

23 మంది వలంటీర్లు రాజీనామా

నందిగామ: మండలంలోని పెద్దవరంలో 11మంది వలంటీర్లు, నందిగామ మండలం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఓ వలంటీర్ పట్టణంలోని ఆయా సచివాలయాల్లో పనిచేస్తున్న 11 మంది కలిపి మొత్తం 23 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామాలు చేశారు. వారి రాజీనామాలను అధికారులకు అందజేశారు.

నేటినుంచి చిట్టేల వెంకన్న బ్రహ్మోత్సవాలు

చిట్టేల(వత్సవాయి) : మండలంలోని చిట్టేలలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను శనివారం నుంచి 8వతేదీ వరకు ఐదురోజులపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త మార్నెళ్ల పుల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివార్లకు శనివారం సుప్రభాత సేవ, తోమాలసేవ, గోపూజ, శ్రీవారి పంచామృత అభిషేకం, యాగశాల ప్రవేశం, ఐదోతేదీన పుణ్యాహవాచనము, భేరిపూజ, సంతానము లేనివారికోసం గురుడా ప్రసాదం అందజేత, ఆరున పల్లకీ ఉత్సవం, ఉత్సవమూర్తులకు విశేషస్నపన, ఉంజల్‌సేవ, శ్రీవారి కల్యాణోత్సవం, 7న యాగశాల కైంకర్యములు, సూర్యప్రభవాహనసేవ, వాహన సమర్పణ, ఏకాంతసేవ, 8న పాలపొంగళ్ల సమర్పణ, ప్రభంజనోత్సవము, గ్రామదేవతలకు జలబిందెలు, చక్రస్నానము, పవళింపుసేవ తదితర పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ బ్రహ్మోత్సవాలకు శ్రీత్రిదండి చిన్నజీయర్‌స్వామితోపాటు పలువురు ప్రవచనకర్తలు హాజరుకానున్నట్లు వివరించారు. బ్రహ్మోత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

క్రికెట్ శిక్షణా శిబిరం ప్రారంభం



జగ్గయ్యపేట: పట్టణంలోని జిల్లా పరిషత్ క్రీడా ప్రాంగణంలో బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఎంపీడీవో రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు, క్రీడాకారులు క్రీడల్లో శిక్షణ పొందాలని సూచించారు. శిక్షణా శిబిరం ఈనెల 31వతేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐ సురేష్‌కుమార్, నిర్వాహకులు రాజేంద్ర, సుధీర్, అనురాగ్ పాల్గొన్నారు.

పండుటాకుల పింఛన్ కష్టాలు

- మండుటెండలో పింఛన్ కోసం వృద్ధుల అవస్థలు..
- బ్యాంకుల వద్ద తప్పని పడిగాపులు
- పింఛన్‌దారులతో చంద్రబాబు అండ్‌కో ఆటలు
- మా ఉసురు బాబుకు తప్పదంటూ పింఛన్‌దారుల శాపనార్థాలు



జగ్గయ్యపే ఎస్‌బీఐలో క్యూలో నిల్చున్న పింఛన్‌దారులు

జగ్గయ్యపేటఅర్బన్, నందిగామ, కంచికచర్ల, పెనుగంచిప్రోలు, వీరులపాడు: భారీవర్షాలు.. తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు...కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఐదేళ్లుగా ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటివద్దనే ఠంచన్‌గా అందిన పింఛన్ నగదు..రెండు నెలలుగా అష్టకష్టాలు పడితే తప్పా అందని పరిస్థితులతో పింఛన్‌దారులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అండ్‌కో కుటిల రాజకీయాల కారణంగా వలంటీర్లు పింఛన్ పంపిణీకి దూరం కావడంతో ఆప్రభావం పింఛన్‌దారులపై పడింది. గతనెలలో పింఛన్ కోసం సచివాలయాల వద్దకు వెళ్లాల్సి రాగా, ఈసారి ఏకంగా బ్యాంకుల చుట్టూ తిరగక తప్పడం లేదని పింఛన్‌దారులు మండిపడుతున్నారు. తన స్వార్థ రాజకీయాల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులతో ఆడుకోవడం చంద్రబాబుకు తగదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 75ఏళ్ల వయస్సు ఉన్న చంద్రబాబుకు వృద్ధుల కష్టాలు తెలిసినా..రాజకీయాలే ముఖ్యమన్న ఆయన వైఖరిని నిరసిస్తున్నారు. తమ ఉసురు చంద్రబాబుకు తప్పక తగులుతుందని శాపనార్థాలు పెడుతున్నారు.

అవసరాలకు డబ్బులు అందక..

బ్యాంకుఖాతాల్లో జమచేసిన నగదు కోసం పింఛన్‌దారులు బ్యాంకుల వద్ద పడిగాపులు పడుతున్నారు.అన్ని గ్రామాల్లో బ్యాంకులు లేకపోవడం, బ్యాంకుఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోవడం.. తగినంత బ్యాలెన్స్ లేకపోవడం, మండుటెండలో కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సి వస్తుండటం, గంటల తరబడి బ్యాంకుల వద్ద వేచి ఉండక తప్పకపోవడంతో పింఛన్‌దారులు అవస్థలుపడుతున్నారు. గంటల కొద్దీ వేచి ఉండి నీరసించిపోతున్నారు. పింఛన్లు సకాలంలో అందని ఈ పాపం చంద్రబాబుదేనని పింఛన్‌దారులు విమర్శిస్తున్నారు. పింఛన్ నగదు అందడంలో తీవ్రజాప్యంపై పింఛన్‌దారుల అభిప్రాయాలు.. వారి మాటల్లోనే..



జుజ్జూరులో బ్యాంకు వద్ద వేచి ఉన్న మహిళలు



పెనుగంచిప్రోలులో ఖాతాదారుల సేవాకేంద్రం వద్ద క్యూలో నిల్చున్న పింఛన్‌దారులు



కంచికచర్ల ఎస్‌బీఐలో వేచిఉన్న పింఛన్‌దారులు



నందిగామలో ఉదయాన్నే బ్యాంకు వద్ద పింఛన్‌దారుల ఎదురుచూపులు

13కి.మీ దూరం నుంచి వచ్చా...



13 కిలోమీటర్లు ప్రయాణించి జగ్గయ్యపేట బ్యాంకుకు వచ్చా. 9గంటలకు క్యూలో నిల్చుంటే నావంతు వచ్చేసరికి మధ్యాహ్నం రెండుగంటలైంది. బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకలేదంటూ పింఛన్ నగదు ఇవ్వలేమన్నారు. జగన్‌బాబు మళ్లీ సీఎం అయితేనే ఇంటివద్దనే పింఛన్ అందుతుంది.

–వెంకటనర్సమ్మ, మంగొల్లు

మా ఉసురు తగులుతుంది..



58 నెలలుగా ఇంటివద్ద వలంటీర్లు పింఛన్ ఇచ్చేవారు. వత్సవాయి మండలం భీమవరం నుంచి జగ్గయ్యపేటకు ఆటోకి రూ.200 ఇచ్చి వచ్చాం. ఉదయం నుంచి బ్యాంకు దగ్గర పడిగాపులు తప్పడం లేదు. మా ఉసురు టీడీపీ వాళ్లకు తప్పకుండా తగులుతుంది.

–మాణిక్యం, భీమవరం

ఇబ్బందిపెట్టడం న్యాయమా..



నాకు 70ఏళ్లు దాటాయి. అనారోగ్యంతో బాధ పడుతున్నాను.గతంలో వలంటీర్లు ఇంటికి వచ్చి ఇవ్వగా, రెండు నెలలుగా పింఛన్ కష్టాలు తప్పడం లేదు. పింఛన్ నగదు కోసం క్యూలైన్‌లో నిలుచుకోలేక కిందనే కూర్చున్నాం. మమ్మల్ని ఇబ్బంది పెడితే వారికి ఏమి వస్తుందో అర్థంకాలేదు.

–ఒంటిపులి గురవమ్మ, జగ్గయ్యపేట.

ఉదయం వచ్చి కూర్చున్నా..



పింఛన్ కోసం బ్యాంక్ దగ్గరకు ఉదయం 8 గంటలకు వచ్చాను. లైన్‌లో నిలబడలేక ఒంట్లో దడగా ఉంటే కూర్చున్నాను. నాకు బిపి, షుగర్ ఉన్నాయి. దీంతో బాగా నీరసంగా ఉంది. పింఛన్ ఎప్పుడు ఇస్తారో కూడా అర్థం కావడం లేదు.

–పి.సావిత్రి, ఐతవరం, నందిగామ మండలం

మా ఊళ్లో బ్యాంక్ లేదు..



మా ఊళ్లో బ్యాంక్ లేదు. స్టాండ్‌తో మాత్రమే నడవగలిగే నేను మండల కేంద్రం పెనుగంచిప్రోలు వెళ్లి పింఛన్ సొమ్ము తీసుకోవటానికి అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండుటెండలో వెళ్లి వచ్చేందుకు అవస్థలుపడ్డా. గతంలో పింఛన్ కోసం మాకీ ఇబ్బందులు లేవు.

–అక్కినపల్లి ప్రకాశం, సుబ్బాయిగూడెం

రెండు నెలలుగా ఇబ్బందులు..



మాలాంటి వారికి పింఛన్ డబ్బే ఆధారం. మందులు, ఇతర అవసరాలకు వాడుకుంటున్నాం. మా వలంటీర్ ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. రెండు నెలలుగా పింఛన్ కోసం మాకు ఈ ఇబ్బంది తప్పడం లేదు.

–పఠాన్ బనూర్‌బీ, సుబ్బాయిగూడెం

అవస్థలు పడుతున్నాం..



వయసు మీద పడి నడవలేకపోతున్నాం..శరీరం సహకరించడం లేదు..ఇటువంటి పరిస్థితిలో బ్యాంకుల వద్దకు వచ్చి పింఛన్ తీసుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. గతంలో మాదిరి వలంటీర్లు వచ్చి పింఛన్లు ఇచ్చేలా చూడాలి.

–నాగయ్య, అల్లూరు

వైఎస్సార్‌సీపీలోకి 42 కుటుంబాలు



నందిగామలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని



రంగాపురంలో ఓట్లు అభ్యర్థిస్తున్న డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు



గండేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

నందిగామటౌన్:నందిగామ టీడీపీ నాయకుడు నర్వనేని మురళి, కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామానికి చెందిన షేక్ బడేహజరత్ వారి అనుచరులైన 42కుటుంబాల వారు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ అరుణకుమార్ వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ నందిగామ ఎమ్మెల్యేగా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అత్యంత భారీమెజార్టీతో గెలుస్తున్నారన్నారు. నందిగామ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్య విచక్షణా జ్ఞానం కోల్పోయి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యే జగన్‌మోహనరావుతో కలిసి పనిచేస్తుండటంతో తనతో మాట్లాడటం మానేశాననటం పేర్కొనడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. ఓప్రజాప్రతినిధి, మరో ప్రజాప్రతినిధితో కలిసిచేయడం తప్పా? అని ప్రశ్నించారు. స్వీయ నిర్ణయాలు తీసుకోలేక ఆమె కొంతమంది బాబుల చేతిలో బందీగా ఉన్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలోకి రోజురోజుకు వలసలు పెరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, చిరుమామిళ్ల చైతన్యకుమార్, అంగడాల పూర్ణ, కొమ్ము విజయరాజు, కన్నెకంటి జీవరత్నం, పాకాలపాటి కిరణ్, ఒర్సు జ్వాలా పాల్గొన్నారు.

అభివృద్ధికి అండగా నిలవండి..

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించానని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించి, ఎన్నికల్లో తనకు అండగా నిలవాలని కోరారు. మండలంలోని పేరకలపాడు, కీసర, పరిటాల, గండేపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేరకలపాడులో యాదవులు ఆయనకు మేకపిల్లను బహుకరించారు. ఎంపీపీ షేక్ మలక్ బషీర్, జడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, సొసైటీ అధ్యక్షులు కోదాటి రామకృష్ణ, వేమవరపు పురుషోత్తం,షేక్ పీర్‌సామియా, బడేహజరత్, పాపట్ల సీత, పాపట్ల స్వామి, పరిటాల రాము, పరిటాల దివ్య, కందుల అశోక్, మర్రి వరప్రసాద్, కృష్ణ, పాపినేని శ్రీనివాసరావు, వరదరాజులు, చాన్‌బహదూర్, నిస్సార్‌పాషా, చలమల ప్రభాకర్, పాల్గొన్నారు.

రంగాపురం, తిమ్మాపురం గ్రామాల్లో..

వీరులపాడు: మండలంలోని రంగాపురం, తిమ్మాపురం గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్ సీపీ నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఆవుల రమేష్‌బాబు, కోటేరు ముత్తారెడ్డి, కాపు, బొమ్మిశెట్టి భాస్కరరావు, షహనాజ్ బేగం, సర్పంచి రమావత్ కోటి, పూలా రాంబాబు, నువ్వుల విశ్వనాధం, బండి మురళి, అనుమోలు వాసు, పూలా పుల్లయ్య పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

జుజ్జూరు(వీరులపాడు): ఇరువురు స్నేహితుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని జుజ్జూరులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల రాము, వేముల అంకరాజు ఇరువురు స్నేహితులు. తెలంగాణలోని ఎర్రుపాలెం వెళ్లి తిరిగి వస్తూ అల్లూరు గ్రామ శివారులోని అట్టల ఫ్యాక్టరీ వద్ద మద్యం తాగుతుండగా ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఈక్రమంలో రాము ఒక్కసారిగా అంకరాజుపై దాడిచేయటంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన అక్కడకు చేరుకుని అంకరాజును నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలించారు. ఈ ఘటనపై సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు.

160 మద్యం సీసాలు స్వాధీనం

నందిగామ: తెలంగాణ రాష్ట్రం మధిర ప్రాంతం నుంచి బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 160 సీసాల మద్యాన్ని గురువారం అర్ధరాత్రి నందిగామ పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. ఈమేరకు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా నందిగామ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ మాట్లాడుతూ అక్రమ మద్యం తరలించడానికి ఎన్ని ఎత్తులు వేసినా పట్టుబడక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ హనీష్, ఎస్సై దుర్గామహేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నందిగామ ఏసీపీ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ తనకుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు ఆయనను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి. రాంబాబు పాల్గొన్నారు.

ఉదయభాను విస్తృత ప్రచారం



తక్కెళ్లపాడులో అభివాదం చేస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేట: మీ ఇంటిలో మేలు జరిగితేనే తనకు ఓటెయ్యాలని ప్రభుత్వ విప్ వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను ప్రజలను కోరారు. మండలంలోని తక్కెళ్లపాడు, గరికపాడు, అనుమంచిపల్లి, మల్కాపురం, గండ్రాయి, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో పార్టీ శ్రేణులు, మహిళలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో అవినీతికి తావులేదన్నారు. అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలను అందించామని గుర్తుచేశారు. తమ పాలనను, గత చంద్రబాబు పాలనను పోల్చుకుని ఎవరు మేలు చేశారో గమనించి, మేలు చేసినవారికే ఓటు వేయాలని కోరారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కారణంగానే పింఛన్లు సరిగా అందక పింఛన్‌దారులకు ఇబ్బందులు వచ్చాయన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని), జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నాయకులు బజారు రవి, సాయి, బద్యానాయక్, పానుగంటి త్రివేణి, మాతంగి వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, పిచ్చయ్యచౌదరి, కొత్తపల్లి లూర్దుమేరి, కనపర్తి శేషగిరిరావు, వంశీ, యలమంద, రాంబాబు, సతీష్, శ్రీనివాసరావు, నరసింహారావు, వినోద్ పాల్గొన్నారు.



గండ్రాయిలో ప్రచార ర్యాలీలో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

వృద్ధుల ఇబ్బందులకు చంద్రబాబే కారణం

బద్దూనాయక్



విలేకరులతో మాట్లాడుతున్న బద్దూ నాయక్, మల్లేశ్వరరావు, భాస్కర్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ఐదేళ్లు ఇంటివద్దనే ఠంచన్‌గా ఒకటోతేదీనే పింఛన్ తీసుకుంటున్న పింఛన్‌దారులు ప్రస్తుతం ఇబ్బందులుపడుతుండటానికి టీడీపీ అధినేత చంద్రబాబే కారకుడని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ విభాగం కార్యదర్శి లాహోరి బద్దూనాయక్ మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం జగ్గయ్యపేట నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు వేముల మల్లేశ్వరరావు, విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం డైరెక్టర్ అల్లూరి కృష్ణవేణి భాస్కర్ తదితరులతో కలసి శుక్రవారం ఆయన విలేకరుతో మాట్లాడారు. వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేయించవద్దని టీడీపీ నాయకులు ఎన్నికల కమిషనకు ఫిర్యాదు చేసినందునే వృద్ధులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబు నిర్వాకం కారణంగా పింఛన్‌దారులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సివస్తోందన్నారు. పింఛన్‌దారుల ఇబ్బందులకు కారణమైన చంద్రబాబుకు ప్రజలంతా ఈ ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు. సీఎం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే వృద్ధులకు సక్రమంగా పింఛన్ అందుతుందన్నారు. నాయకులు కాటేపల్లి రవి, గుడ్ల రామారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోరుతూ ప్రచారం



ప్రచారంలో సామినేని విమలాభాను, వేల్పుల రవికుమార్, నాగమణి, పద్మకుమారి



ప్రచారం చేస్తున్న ఉదయభాను సోదరి బేబి, కోడలు కావ్య, కుమార్తె పద్మప్రియాంక



మాగల్లులో ప్రచారం చేస్తున్న రవిశంకర్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట రైతుబజారులో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను సతీమణి విమలాభాను ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రైతుబజారులోని రైతులు, కొనుగోలుదారులను ఆత్మీయంగా పలకరించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేసిన ఉదయభానుతోపాటు ఎంపీగా కేశినేని నానిని గెలిపించాలని ప్రజలను కోరారు. అదేవిధంగా స్థానిక ఆర్టీసీ కాలనీలో ఉదయభాను గెలుపును కాంక్షిస్తూ ఆయన సోదరి చాముండేశ్వరి(బేబి), కుమార్తె పద్మ ప్రియాంక, కోడలు కావ్య ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ఐదేళ్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన మేలు గుర్తుంచుకుని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి విమలాభాను, ఆపార్టీ నాయకులు శుక్రవారం పెనుగంచిప్రోలులోని 15,16వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఉదయభాను, విజయవాడ ఎంపీగా కేశినేని నానిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, సర్పంచి వేల్పుల పద్మకుమారి, జెడ్పీటీసీ సభ్యులు వూట్ల నాగమణి, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, గ్రామ పార్టీ అధ్యక్షులు కాకాని హరి, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు, ఎంపీటీసీ సభ్యురాలు కాకాని స్రవంతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, పచ్చల శివప్రసాద్, కన్నేటి వెంకటరమణ, అంగజాల కాసులు, జయశ్రీ, కాకాని పద్మ, బొమ్మి రాణి, ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మాగల్లు గ్రామంలో...

నందిగామ: సంక్షేమ పథకాలు సజావుగా అందాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సి ఉందని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. నందిగామ మండలం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని మాగల్లులో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. విజయవాడ ఎంపీగా కేశినేని నాని, ఎమ్మెల్యేగా సామినేని ఉదయభానును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.మాగల్లులో కొట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గ్రామంలోని పేద విద్యార్థుల కోసం జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేసిన ఘనత ఉదయభానుకే దక్కుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మినేని శోభారాణి, నాయకులు పాల్గొన్నారు.

పార్టీల కతీతంగా పథకాలు



భీమవరం(వత్సవాయి) : మండలంలోని భీమవరం గ్రామంలో టీడీపీకి చెందిన పది కుటుంబాలవారు ఆపార్టీని వీడి శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు జనరంజకపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. పార్టీలకతీతంగా ప్రతి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రికి అండగా ఉండేందుకే పార్టీలో చేరామన్నారు. ఉదయభాను, కేశినేని నాని విజయానికి కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పెనుగొండ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ షేక్ నాగుల్‌హుస్సేన్, భువనగిరి సైదులు, గొడితాల శ్రీను తదితరులు పాల్గొన్నారు